

స్పందనకు 21 ఫిర్యాదులు

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 21 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్ తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై వచ్చినట్లు తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.

ట్యాబ్‌లు ఇచ్చారు.. పర్యవేక్షణ మరిచారు..!

పట్టించుకోని ప్రభుత్వం, బైజూస్ సంస్థ

రెండు జిల్లాల్లో 32 వేలకుపైగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

ఏడాది గడవక ముందే 30 శాతానికిపైగా ట్యాబ్‌లు మూలకు

ఛార్జింగ్ ఎక్కకపోవడం వంటి పలు సమస్యలతో పక్కకు

యూట్యూబ్, వీడియో గేమ్స్ అప్‌లోడ్‌తో లక్ష్యానికి తూట్లు

ఉపాధ్యాయుల అవస్థలు వర్ణనాతీతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ట్యాబ్‌ల విద్య ఏడాది గడవక ముందే అటకెక్కింది. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాబ్‌ల విద్య అగమ్యగోచరంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గతేడాది డిసెంబర్ 21న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎనిమిదో తరగతి విద్యార్థులందరికీ బైజూస్ సంస్థకు సంబంధించిన ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,353 మంది విద్యార్థులకు, ఏలూరు జిల్లాలో దాదాపు 18 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. నిబంధనల ప్రకారం ఈ ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి వరకూ వినియోగించుకోవాల్సి ఉంది. ఆయా తరగతులకు సంబంధించిన పాఠాల కంటెంట్‌ను బైజూస్ సంస్థ అందులో ఏర్పాటు చేసింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా పాఠాలు తప్ప లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్ పాఠ్యాంశాలకు సంబంధించిన కంటెంట్‌ను దీనిలో పొందుపర్చారు. తొలుత నాలుగైదు నెలలు అంతా సవ్యంగానే సాగింది. విద్యార్థులు ట్యాబ్‌లో ఏయే పాఠాలు వింటున్నారు.. ఏయే పాఠాలు వినడం లేదో పైస్థాయిలో పర్యవేక్షణ ఉండేది. బైజూస్ సంస్థ ఆర్థికంగా దెబ్బతిని మార్కెట్లో చతికలబడటం, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాబ్‌ల విద్య పూర్తిగా పక్కకుపోయింది.



30 శాతం ట్యాబ్‌లు మూలకు

పలు ట్యాబ్‌ల్లో యూట్యూబ్, ఫ్రీ ఫైర్ గేమ్స్

రెండు జిల్లాల్లో విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌లో 30 శాతం వరకూ పని చేయడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా ఛార్జింగ్ నిలబడకపోవడం, లాగిన్ అని అడగడం వంటి సమస్యలు ఉన్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ట్యాబ్ రిపేర్ వస్తే తిరిగి బాగుచేసే వ్యవస్థ లేకుండాపోయింది. చిన్నచిన్న సమస్యలైతే సచివాయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు చూస్తున్నారు. మూడేళ్లపాటు ఉపయోగపడాల్సిన ట్యాబ్ నాలుగైదు నెలలకే మూలనపడిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు మళ్లీ పాత పద్ధతిలోనే విద్య అభ్యసించాల్సి వస్తోంది. తరగతిలో కొంతమంది ట్యాబ్ ఉపయోగించడం, మరికొంతమందికి ట్యాబ్‌లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. కొత్తగా ఎనిమిదో తరగతిలో చేరిన విద్యార్థులకు ట్యాబ్‌లు ఎప్పటికిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా బైజూస్ సంస్థ అందించిన ట్యాబ్‌లో పాఠాలకు సంబంధించిన కంటెంట్ తప్ప వేరే ఏవీ ఓపెన్ కావని అప్పట్లో అధికారులు తెలిపారు. అయితే బైజూస్ ట్యాబ్‌ల్లో యూట్యూబ్, గేమ్స్ వంటివి అప్‌లోడ్ చేసుకోవడం ఎలా అనే వీడియోలు యూట్యూబ్‌లో వచ్చేశాయి. దీంతో విద్యార్థులు యూట్యూబ్ వీడియోలు చూసి ట్యాబ్‌ల్లో యూట్యూబ్, ఫ్రీఫైర్ గేమ్స్ వంటివి అప్‌లోడ్ చేసుకోవడంతో అసలుకే మోసం వచ్చిందని ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పైస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. పైనుంచి పర్యవేక్షణ చేస్తే విద్యార్థులు ట్యాబ్‌ను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో ఈపాటికి ప్రభుత్వానికి తెలిసి ఉండేది. పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ట్యాబ్‌ల విద్య పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్భాటంగా ట్యాబ్‌లను పంపిణీ చేసిన ప్రభుత్వం, తర్వాత గాలికి వదిలేయడంతో హైస్కూల్ విద్యకు తీవ్ర విఘాతం ఏర్పడే పరిస్థితి నెలకొంది. బైజూస్ సంస్థకు లాభాలు రావడం తప్ప, విద్యార్థులకు ఉపయోగపడని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం ట్యాబ్‌లకు సంబంధించి సరైన పర్యవేక్షణ ఏర్పాటు చేస్తే లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.



సచివాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్, జెసితో కలిసి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లతో ఓటర్ల జాబితా పరిశీలనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటర్ల సర్వే వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. డోర్ టుడోర్ సర్వేలో సేకరించిన ఫారం 6, 7, 8ని అనుసరించి కొత్తగా చేర్చిన ఓటరు వివరాలు, మార్పులు సవరణ ఏ రోజుకారోజు సరిచూసుకోవాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే 90 శాతం పూర్తయిందని ఆన్‌లైన్ చేయడం వేగవంతం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఓటర్ల జాబితా పగడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 32 వార్డు సచివాలయాన్ని, పెంటపాడు మండలం ముదునూరు గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టరు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. సాయంత్రానికి నూరుశాతం సర్వే పూర్తిచేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేర్లు తొలగించారని ఫిర్యాదులు రాకూడదని, అందరూ మెచ్చే విధంగా ఓటరు జాబితా ఉండాలని తెలిపారు. ఎంత మందిని కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది ఓటర్లను తొలగించారని, ఎంత మంది ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని, 80 ఏళ్లు పైబడిన ఓటర్లు ఎంత మంది ఉన్నారని కలెక్టరు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎఇఆర్‌ఒ జిల్లా హార్టీకల్చర్ అధికారి ఎ.దుర్గేష్, తహశీల్దార్లు వై.దుర్గాకిషోర్, జివి శేషగిరి, పురపాలక సంఘం కమిషనర్ ఎ.శామ్యూల్, ఎంపిడిఒలు సిహెచ్ బాలాజీ, విశ్వనాథం, డిప్యూటీ తహశీల్దారు శివశంకర్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టరేట్ పరిపాలన అధికారి అప్పారావు

ప్రజాశక్తి - భీమవరం

స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి అప్పారావు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలలా ప్రజల నుండి వచ్చిన 162 వినతలను పరిపాలనాధికారి అప్పారావుతో పాటు డిఎస్‌పి డి.శ్రీనాథ్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్.ప్రసాద్ స్వీకరించారు. భీమవరం ముత్రాసుల దిబ్బ శివారు అడ్డ సందు ప్రాంతంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని పి.దుర్గారావు, స్థానికులు ఫిర్యాదు చేశారు. పంట భూముల మధ్య ఉన్న డ్రెయిన్ పూడుకుపోవడంతో సుమారు 50 ఎకరాల పంట పొలాలు నీటమునిగి నష్టపోతున్నామని, డ్రెయిన్‌లో పూడిక తీయాలని యలమంచిలి మండలం అడవిపాలెంకు చెందిన చిన్నకారు రైతు ఉల్లంపర్తి వెంకటేశ్వరరావు కోరారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో రీసర్వేలో తన భూమి తక్కువైందని పరిష్కరించాలని వి.నారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో గృహాలు నిర్మించుకుని ఉంటున్న కొత్తకాలనీ వాసులు కాలనీకు అనుకుని ఉన్న పంట భూమిని రొయ్యల చెరువుగా తవ్వేస్తున్నారని, వెంటనే చెరువు తవ్వకం పనులను ఆపాలని భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ములపర్తి కేశవరావు, ముస్కుడి సింహాచలం, ములపర్తి బంగారమ్మ, మద్దా మరియమ్మ, చుట్టుగుళ్ల రవి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరేట్ పరిపాలన అధికారి అప్పారావు

వేగవంతంగా ఓటర్ల సర్వే : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని 1,454 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సర్వే వేగవంతంగా జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై భీమవరం, ఉండి, ఆచంట నియోజకవర్గాల ఎఇఆర్‌ఒలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గతేడాది జులై ఒకటి నుండి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకూ, ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ రెండు విడతల్లో ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్నారు. ఈ జాబితాల నుంచి పోలింగ్ స్టేషన్ల పరిధిలో వెయ్యి మంది ఓటర్లను రాండమ్ చెక్ చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఫొటో సిమిలారిటీ, షిఫ్టింగ్, చనిపోయిన వారి ఓట్ల పరిశీలనకు పంచనామా ఉంటే ఫారం-7 ను సంతకంతో తీసుకోవడంతోపాటు, ఫారం 13, 14లో నోటీసులు అందజేయాలన్నారు. చనిపోయిన వారి ఓటు తొలగింపునకు మరణ ధ్రువీకరణ పత్రం సరిపోతుందన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో మార్పు, చేర్పులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, జిల్లా సర్వే అధికారి జాషువా, ఎన్నికల సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేయాలని జెసి రామ్ సుందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, బిఎల్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు విషయాలపై ఆరా తీశారు. సకాలంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటింటి సర్వే గడువు ఈరోజుతో పూర్తయ్యిందన్నారు. బిఎల్‌ఒలు, మండలాల ప్రత్యేక అధికారులు సమన్వయంతో రీ వెరిఫికేషన్ చేసి సంబంధిత రిపోర్టులు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జి.అనితకుమారి, డిటి నరేష్ కుమార్, ఆర్ఐ శిరీష, ఇఒ ఆర్‌డి వీడిది నవీన్‌కిరణ్, మౌనిక ఉన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో ఓటర్ జాబితా సవరణపై జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి సమీక్షించారు. ఓటర్ జాబితా సవరణపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే గడువు పూర్తవుతున్నందున బిఎల్‌ఒలు, మండలాల ప్రత్యేక అధికారులు సమన్వయంతో రీ వెరిఫికేషన్ చేసుకొని రిపోర్టులు అన్‌లైన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్, డిప్యూటీ తహశీల్దార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం



పెనుమంట్ర మండలం మార్టేరులో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సోమవారం ఉదయం మండలంలో భారీ వర్షం పడింది. ఉదయం 8:30 నుండి 11 గంటల వరకూ పొలమూరు, పెనుమంట్ర, మాముడూరు, మార్టేరు, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు కాస్త ఇబ్బంది పడ్డారు. జుత్తిగ హైస్కూల్ రోడ్డు, పెనుమంట్ర వెళ్లే రహదారి, మాముడూరు నుండి పొలమూరు వెళ్లే రహదారుల్లో గోతుల్లో వర్షపునీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు నానా పాట్లు పడ్డారు. అలాగే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఆచంట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై మండలంలో సోమవారం ఉదయం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. దీంతో ఆచంట కచేరీ సెంటర్లోని ఆచంట - మార్టేరు ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి నీట మునిగింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మండలంలో ప్రధాన రహదారులు, లింక్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు అధ్వానంగా మారాయి. పలు పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. నివాస ప్రాంతాలు, కాలనీలో సీసీ డ్రెయిన్లు నిర్మించకపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

తాడేపల్లిగూడెం : ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా తాడేపల్లిగూడెంలో అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8:40 నిమిషాల నుంచి సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న డ్రెయినేజీలు ఒక్కసారిగా పొంగి పొర్లాయి. మసీదు, శేషమహల్ రోడ్డు, తాలూకాఫీస్ ప్రాంగణం, కడకట్ల, యగర్లపల్లి, ఆర్‌టిసి బస్ ప్రాంగణాలు నీట మునిగాయి. విద్యార్థులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.



ఎపిఎం సునీతకు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

కనీస వేతనం ఇవ్వాలని విఒఎల వినతి

ప్రజాశక్తి - అత్తిలి

తమకు కనీస వేతనం రూ.25 వేలు పెంచాలని, పెంచిన వేతనం తమ పర్సనల్ ఖాతాలోకి జమ చేయాలని విఒఎలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఐకెపి ఎపిఎం పి.సునీతకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఒఎలు మాట్లాడారు. తమకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సర్వేలో 5జీ నెట్‌వర్క్ మొబైల్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుక్క ఝాన్సీ, ముత్యాల భాగ్యలక్ష్మి, ఉండూరి సుజాత, గుబ్బల పావని, కాటూరి గౌరీ ప్రసన్న పాల్గొన్నారు.

జగనన్నకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ జివి.ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక విష్ణు కాలేజీ మినీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశానికి చీఫ్ ఇంజినీర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. నెలాఖరుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన 24,675 గృహాల్లో మౌలిక వసతులను గృహప్రవేశాల నాటికి పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా సోప్ పిట్స్ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పాలుపంచుకునే అధికారులు ఎప్పటికీ లబ్ధిదారులకు గుర్తుండిపోతారన్నారు. సొంతింటి నిర్మాణం అనేది ప్రతి ఒక్కరికీ ఒక కల అన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వెంకటరమణ, డిఇలు, ఎఇలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ జివి.ప్రసాద్

రోడ్డు నిర్మించాలని సిపిఎం పాదయాత్ర

పెనుమంట్ర: పొలమూరు నుంచి మాముడూరు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారి అధ్వానంగా ఉందని, ఆ రోడ్డును నిర్మించాలని సిపిఎం మండల కమిటీ సభ్యురాలు కేతా పద్మజ డిమాండ్ చేశారు. సోమవారం పొలమూరు శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మాముడూరు వంతెన వరకూ రోడ్డు నిర్మించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కేతా పద్మజ మాట్లాడుతూ ఈ రహదారిలో గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణం అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు,శాఖ కార్యదర్శి రాపాక ఆశీర్వాదం, కముజు ప్రసాద్, పిల్లి సాయిబాబా, పంపన సూర్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



రాంబాబును కఠినంగా శిక్షించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం

భార్యను హత్య చేసిన రాంబాబును కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో డిఎస్‌పి శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొగాకు పూర్ణ మాట్లాడుతూ సంధ్యారాణి వ్యసనాలకు బానిసైన భర్త నుంచి దూరంగా వచ్చి తన బతుకు తాను బతుకుతోందని తెలిపారు. ఆ విధంగా కూడా ఆమెను బతకనివ్వకుండా నడిరోడ్డు మీద కత్తితో పొడిచి హత్య చేశాడని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగడానికి మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి కారణమని తెలిపారు. జిల్లాలో విచ్చలవిడిగా వీటి అమ్మకం జరుగుతోందని, నియంత్రించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్టు ఉంటున్నారని తెలిపారు. తక్షణం వాటిని వెంటనే నియంత్రించాలని ఆమె కోరారు. దీనిపై డిఎస్‌పి మాట్లాడుతూ తక్షణం ఆ వ్యక్తికి శిక్షపడే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయ్‌కుమారి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సరోజిని, డి.లక్ష్మీపార్వతి, రాణి పాల్గొన్నారు.



డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నేతలు

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి : సిపిఎం

ప్రజాశక్తి - తణుకురూరల్

కమ్యూనిస్టులు పదవుల కోసం కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మాత్రమే పని చేస్తారని ఆచరణలో చూపిన వ్యక్తి మద్దాల వెంకట స్వామి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. సోమవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద మద్దాల వెంకటస్వామి 15వ వర్ధంతి సందర్భంగా మద్దాల విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాల వల్లే ప్రభుత్వాలు పేదల గురించి ఆలోచిస్తున్నాయన్నారు. మద్దాల వెంకటస్వామి చిన్ననాటి నుంచి జాతియోద్యమ స్ఫూర్తితో అగ్రకులంలో జన్మించినప్పటికీ పేదల కోసం తుదివరకూ జీవించారన్నారు. తనకున్న ఆస్తిని ఉద్యమాలు, పోరాటాలు కోసం ఖర్చు పెట్టారని పేర్కొన్నారు. మద్దాల వెంకటస్వామి దేవా దాయ, కౌలు రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అయినప్పటికీ కూడా నేటికీ రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర స్ఫూర్తితో కాకుండా కార్పొరేట్ల దారిలో సాగడం బాధాకరమన్నారు. మద్దాల ఆశయాలు అమలు కోసం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, వెంకటస్వామి మనవరాలు యర్రా రాజ్యలక్ష్మి, ఉషా, నారాయణరావు పాల్గొన్నారు.



మద్దాల వెంకటస్వామి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు పొందాలి

డిపిఒ మల్లికార్జునరావు

ప్రజాశక్తి - ఉండి

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. ఉండి దివ్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన విద్యార్థులందరూ ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవాలని, మండలంలో ఓటు హక్కు నమోదుకు గడువు ఈ నెల 25తో ముగుస్తుందని తెలిపారు. ఓటు వజ్రాయుధంతో సమానమని, ఎంతో నిర్ణయాత్మకంగా ఓటు వేసే మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ ఓటు హక్కును పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతం కావాలని ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భారత్ పరిశోధన చంద్రయాన్-3 సంపూర్ణంగా సఫలీకృతం కావాలని చంద్రయాన్-3 జయహో అంటూ కెజిఆర్ఎల్ బి ఫార్మసీ కళాశాల విద్యార్థులు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం సర్వమత ప్రార్థనలు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కవల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ పరిశోధక సంస్థ ఇస్రో సంస్థ జులై 14వ తేదీన చేపట్టిన చంద్రయాన్-3 అతి తక్కువ కాలంలోనే విజయానికి చేరువ కావడం భారతీయులు ఆశాక్త్ర అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టిన చంద్రయాన్-3 సాహసోపేతమైన కార్యక్రమమని, ఈ నెల 23న సాయంత్రం 6 గంటలకు చంద్రునిపై కాలు మోపుతుందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నిర్మల మాట్లాడుతూ ప్రపంచమంతా చంద్రయాన్-3 విజయం కోసం ఎదురు చూస్తుందన్నారు. అనంతరం హిందూ ముస్లిం క్రైస్తవ సర్వమత ప్రార్థనలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాల సందర్భంగా పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రీడర్స్ ఫోరమ్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్రకేసరి టంగుటూరి జయంతి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, జాన్సీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత చరిత్రను వివరించారు. ఇటువంటి మహనీయుల చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మూడురోజుల పాటు కళాశాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. సైమన్ గో బ్యాక్ ఉద్యమం, ప్రకాశం పంతులు జీవిత విశేషాలపై పిఎస్ఎం హైస్కూల్‌లో 46 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని తెలిపారు. 22న ర్యాలీ, 23న క్విట్ ఇండియా స్తూపం వద్ద నిర్వహించే ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో అంజనికుమార్‌నాయక్ ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 20వ తేదీన విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ కయాకింగ్ 500 వందల మీటర్ల పోటీల్లో విష్ణు కళాశాల విద్యార్థి అంజనికుమార్‌నాయక్ పతకం సాధించాడని ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 14వ తేదీ నుంచి 17 వరకు ఉత్తరాఖండ్‌లోని తెహ్రిడాన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్ కయాకింగ్ పోటీల్లో అంజనికుమార్‌నాయక్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా అంజనికుమార్‌నాయక్‌ను కోచ్ తిరుమలరావు, కళాశాల ప్రిన్సిపల్ దశ సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, మెకానికల్ హెచ్ఒడి వేణు అభినందించారు.

వీరబ్రహ్మానికి వాస్తు జ్యోతిష్య రత్న అవార్డు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్‌కు చెందిన ఆముదాలపల్లి వీరబ్రహ్మం విశ్వకర్మ సేవా ట్రస్టు అందించే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని ఆ సంఘ సభ్యులు సోమవారం తెలిపారు. తమ సంస్థ వివిధ ప్రాంతాలకు చెందిన వాస్తు, జ్యోతిష్య తదితర వాటిలో సేవాకార్యక్రమాలు చేసే ప్రతిభావంతులను ఎంపికచేసి జాతీయ పురస్కారాలు అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా వాస్తు, జ్యోతిష్యంలో శుభయోగ పంచాంగ రచయిత వీరబ్రహ్మం అందిస్తున్న సేవలకు ఆయనకు వాస్తు జ్యోతిష్యరత్న బిరుదు, బంగారు నంది అవార్డును ఆ ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చేనెల పదో తేదీన విజయవాడలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో అందించనున్నారని ఆ సంఘ సభ్యులు తెలిపారు.

పేద కుటుంబానికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పదో వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన రామారావు కాలు విరగడంతో మంచానికి పరిమితమయ్యాడు. అప్పటికే భార్య క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతుంది. చేతికందొంచిన వారి కుమారుడు గుండుజబ్బుతో మృతి చెందాడు. పేద కుటుంబం గురించి తెలిసిన వారు విషయం వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్, క్లబ్ తరపున రూ.నాలుగు వేల మందులతో పాటు రూ.రెండు వేల నగదు సోమవారం ఆ కుటుంబానికి అందించారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, వంగా నరసింహరావు, సోమంచి శ్రీనివాసశాస్త్రి, నంబూరి గంగాపవన్, గుప్త పాల్గొన్నారు

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం నిర్వ హిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. సోమవారం సిహెచ్.అగ్రహారంలో నిర్వ హించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు వైద్యం మరింత దగ్గరగా అందించే విధంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెలకు మూడుసార్లు గ్రామాల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి 104 వాహనం ద్వారా వృద్ధులకు బిపి, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చుక్క అప్పారావు, ఎంపిటిసి సభ్యులు పివి.నారాయణ, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

24న రైతు సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

న్యూఢిల్లీలో ఈ నెల 24న రైతు సంఘాల సమైక్య సమితి (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించే రైతు సదస్సు జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి రైతు సంఘం ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ఉభయ జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం తణుకులో కలుసుకున్నారు. తణుకులో జరుగుతున్న సేవాదళ్ సమావేశానికి హాజరైన మిథున్‌రెడ్డిని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ కలిసి భీమవరం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి వెంటనే నిధులు మంజూరు చేయించాలని కోరారు.

సీఫుడ్స్ సప్లయర్స్ సంఘం రాష్ట్ర కోశాధికారిగా రాంబాబు

పాలకోడేరు :పాలకోడేరు మండల బిసి నాయకుడు, టిడిపికి చెందిన కామన రాంబాబు ఆంధ్రప్రదేశ్ సీఫుడ్స్ సప్లయర్స్ అసోసియేషన్ కోశాధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కామన రాంబాబును టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, టిడిపి గొల్లలకోడేరు అధ్యక్షులు, కమ్మిలి వెంకట శివరామకృష్ణంరాజు (రాంబాబు) కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు.

ఓటర్ల జాబితా సవరణపై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


ఓటర్ల జాబితా సవరణపై ఏ సందేహాన్నైనా అధికారులతో నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణ, రేషనలైజేషన్ ప్రక్రియ, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఓటర్ల జాబితా సవరణ, తదితర అంశాలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో ఎటువంటి అపోహలకు, అనుమానాలకు తావు లేదన్నారు. ఏ విషయాన్ని అయినా అధికారులతో మాట్లాడి సందేహ నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే కచ్చితంగా తెలియజేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ మార్పు అనేది కేవలం ఆ పోలింగ్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంటేనే చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి ప్రతినిధి బిహెచ్.శ్రీనివాస్‌వర్మ, ఐఎన్‌సి ప్రతినిధి టి.వంశీరెడ్డి, బిఎస్‌పి కాటూరి కరుణాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, వైసిపి నాయకులు కామన నాగేశ్వరరావు, టిడిపి నాయకులు ఉప్పులూరి చంద్రశేఖర్, ఎం.శ్యాంబాబు, కలెక్టరేట్ ఎఒ అప్పారావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు, ఎలక్షన్ సెక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

'మానవత' ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

ప్రజలందరూ శాంతి మార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా సభ్యులు రుద్రరాజు సూర్యనారాయణరాజు అన్నారు. సోమవారం ఉండి మెయిన్ సెంటర్‌లో మానవత మండల అధ్యక్షులు కట్రెడ్డి తాండవ నాగ సత్యనారాయణ అధ్యక్షతన దివ్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించి మానవహారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రుద్రరాజు సూర్యనారాయణరాజు, మాజీ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతి మార్గంలో పయనిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పరిసరాలను పరిరక్షించినవారవుతారని చెప్పారు. మానవత ఉండి కన్వీనర్ కొమ్మన నాగబాబు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ మానవత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదేళ్ల నుంచి వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రపంచ శాంతి ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో 500 శాఖలకు పైగా విస్తరించిన మానవత ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలో తొమ్మిది ఫ్రీజర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పిఆర్‌కె.రాజు, కూనపరాజు వెంకటరామరాజు, దివ్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉండి మెయిన్ సెంటర్‌లో మానవత ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిర్యాలీ

నేడు గణపవరంలో శాంతి ర్యాలీ

గణపవరం :మానవత సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ ఉపాధ్యక్షులు బుద్ధారపు పుల్లయ్య తెలిపారు. స్థానిక డిగ్రీ కాలేజీ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు శాంతి ర్యాలీ జరుగుతుందని చెప్పారు. ర్యాలీలో ఎంఎల్‌సి మోషేన్‌రాజు, స్థానిక ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంట పద్మశ్రీ, ఎంపిపి దండు వెంకటరామరాజు పాల్గొంటారని తెలిపారు.

సంధ్యారాణి కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

భర్త చేతిలో దారుణ హత్యకు గురైన సంధ్యారాణి బిడ్డకు కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడికి ఉరిశిక్ష వేయాలని ఎంఎల్‌ఎ రామరాజు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డుండి రాకేష్ డిమాండ్ చేశారు. సంధ్యారాణి హత్యకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణకు వినతిపత్రం చేశారు. నిందితుడు సంధ్యారాణి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి బెదిరించడం దారుణమన్నారు. మహిళా సంరక్షకుడినని చెప్పుకుంటున్న జగన్ ఎక్కడ అని ప్రశ్నించారు. ఆర్యవైశ్యులపై ఇటీవలకాలంలో దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. సంధ్యారాణి కుటుంబానికి న్యాయం చేయకపోతే జిల్లా స్థాయిలో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంట్ల గణపతి, టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు గొల్ల వెంకట్రావు, కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర వాణిజ్యభాగం కార్యదర్శి బిజెఎస్.మాల్యాద్రి, ఏలూరు జిల్లా అధ్యక్షులు కెకె.బాబు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి అజ్మల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాండ్రం బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

దళితులంటే అగ్రవర్ణాలకు అంత చులకనా అని ఎపి బహుజన జెఎసి ఫౌండర్, కన్వీనర్ తాళ్లూరి మధు అధికారులను ప్రశ్నించారు. మండలంలోని వాండ్రం గ్రామంలో ఇటీవల దాడికి గురైన బాధిత కుటుంబాలను సోమవారం తాళ్లూరి మధు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణానికి చెందిన కొంతమంది వ్యక్తులు దళితులపై దాడి చేయడమే కాకుండా క్రైస్తవులు ఎంతో పవిత్రంగా చూసుకునే ప్రార్థన మందిరం అద్దాలను పగలగొట్టడం సరికాదన్నారు. ఈ దాడులకు బాధ్యులను అధికారులు వెంటనే అరెస్టు చేసి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులకు న్యాయం చేసే వరకు నిరాహార దీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి జాయింట్ సెక్రటరీ దానం విద్యాసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ ఆదాము, పిల్లా శ్రీనివాస్, తాళ్లూరి రాజకుమార్, పి.నరసింహరావు, సంఘ పెద్దలు ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోరుతూ వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సుమారు ఏడు వేల జనాభా కలిగిన పొలమూరు పంచాయతీ పరిధిలోని రెండు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పంచాయతీ వార్డు సభ్యుడు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు తోరం వెంకన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక డిజిటల్ అసిస్టెంట్ బదిలీ కాగా మరోకరు విధులకు హాజరు కావడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ సచివాలయాల్లో ఇతర విభాగాల ఉద్యోగులు పనులు చేస్తున్నారన్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రజల పనులు సకాలంలో పూర్తికావడం లేదన్నారు. గంటల వ్యవధిలో పూర్తి కావాల్సిన పనులు సైతం రోజులు పడుతున్నాయని చెప్పారు. సచివాయాల్లో కీలకమైన డిజిటల్ అసిస్టెంట్స్ లేకుండా నిర్వహణ సాధ్యం కాదని తెలిపారు. మేజర్ పంచాయతీ దృష్ట్యా ఇతర సచివాలయాల్లో ఉన్న ఒకరిని ఇక్కడకు తాత్కలికంగా డిప్యూటేషన్ బాధ్యతలు అప్పగించాలని కోరారు. తద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పారిశుధ్య కార్మికులకు టెండర్ విధానం రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెనుగొండ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి మహంత్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు టెండర్ విధానం రద్దు చేసి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అధిక ధరలతో సతమతమవుతున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ యాజమాన్యాలు కార్మికుల స్థితిగతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలను శుభ్రం చేస్తున్న కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నా, రోగాల బారిన పడుతున్నా పట్టించుకునే పరిస్థితి గ్రామాల్లో లేదని విమర్శించారు. మరోవైపు మండలంలోని పలు పంచాయతీల్లో యాజమాన్యం కార్మికు లను చిన్నచూపు చూస్తుందని, పని నుంచి అక్రమంగా తొలగించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి మండలం లోని అన్ని పంచాయతీ కార్మికుల స్థితిగతులను పట్టించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బంగారు విజయ, లలిత, వాణిశ్రీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఛాంబర్ కళాశాల విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం వైఎన్ కళాశాలలో ఇంటర్ బైపిసి చదువుతున్న విద్యార్థిని దేవరపు హేమజ్యోతికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లకు గాయాలై భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొంతుతోంది. ఈ క్రమంలో హేమజ్యోతికి తోడుగా తామున్నామంటూ పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ విద్యార్థులు, కళాశాల సిబ్బంది, యాజమాన్యం రూ.25,245 ఆర్థిక సహాయాన్ని సేకరించి కుటుంబ సభ్యులకు అందించి మానవత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు మాట్లాడుతూ ఇతరుల సంతోషంలో కన్నా బాధల్లో పాలు పంచుకోవటం ఒక సేవా తత్పరత అని అన్నారు. ఇటువంటి సందర్భాల్లో ఛాంబర్స్ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటడం గర్వకారణమన్నారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం పెంపొందిస్తూ ఇతరుల పట్ల సామాజిక బాధ్యతను వ్యక్తికరించటం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్స్ టి.రాధామాధవి, విప్పర్తి శామ్యూల్, కె.రాంబాబు, అధ్యాపకులు యు.జానకిరామయ్య, విద్యార్థులు కుటుంబ సభ్యులను ప్రత్యక్షంగా కలిసి వారికి సేకరించిన రూ.25 వేలు అందించారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అధ్యక్షతన సోమవారం వృద్ధుల సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అతిథిగా హాజరైన కెవిఎస్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు వృద్ధులకు మద్దతునిస్తూ సమాజంలో వారి భాగస్వామ్యాన్ని గుర్తించి, అభినందించడం కోసం వృద్ధుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. 1988 ఆగస్టు 21న అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ దినోత్సవం ప్రకటనపై సంతకం చేశారని చెప్పారు. ప్రస్తుతం చిన్న చిన్న కుటుంబాలు అయిపోయి ఉద్యోగరీత్యా విదేశాల్లో స్థిరపడి, తల్లిదండ్రులను రోడ్డుపైకి వదిలేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు వారి తల్లిదండ్రులు సరిగ్గా చూసుకోకపోవడం వల్ల వృద్ధాశ్రయాలు ఎక్కువ అయ్యాయని చెప్పారు. అనంతరం విద్యార్థులతో చిరు సత్కారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకివీడు : వృద్ధులను, తల్లిదండ్రులను గౌరవించడం మన ధర్మమని, ఇటువంటి ధర్మాలను నేర్పిన భారతీయ సమాజం ఎంతో గొప్పదని సిఐ కట్ట సత్యనారాయణ అన్నారు. సోమవారం ప్రపంచ వృద్ధుల సంక్షేమ దినోత్సవ కార్యక్రమాలు నూతనంగా నిర్మించిన స్థానిక లయన్స్ హాలులో ఏలూరుపాడుకు చెందిన మంతెన సూర్య నారాయణరాజు సుభద్రయ్య ఛారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్, సర్దార్ కాటన్ ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో సిఐ మాట్లాడారు. సమాజంలో ధర్మానికి అర్థం, విలువ తెలియ కుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరుపాడు మంతెన సూర్య నారాయణ రాజు సుభద్రయ్య ఛారిటబు ల్ ట్రస్ట్ అధ్యక్షులు మంతెన వర్మ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమాజంలో అవసరమైన వారికి తాను సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ దాట్ల రామరాజు, వ్యాట్ మెంబర్‌షిప్ నిర్వాహకుడు ఆర్‌వి.సూర్యనారాయణ రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ వీడియో కార్యదర్శి అచ్చారావు మాట్లాడారు. అనంతరం పేద వృద్ధ మహిళలకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు అందించారు.

విద్యుత్ ఛార్జీల చెల్లింపునకు బిల్లుపై క్యూఆర్ కోడ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యుత్ వినియోగదారులు ఇకమీదట విద్యుత్ ఛార్జీలను బిల్లుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని ఎపిఇపిడిసిఎల్ డిఇ ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కార్యాలయానికి సంబంధించిన ఎలాంటి పనులైన గ్రామ, వార్డు సచివాలయంలో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సర్వీసుకు ఆధార్ నెంబర్ లింక్ కానివారు తమ ఆధార్ కార్డ్ జిరాక్స్ పత్రాలను సంబంధిత విద్యుత్ సెక్షన్ అధికారులను సంప్రదించి ఆధార్ లింక్ చేయించుకోవాలని సూచించారు. పూర్వీకుల పేరు మీద ఉన్న విద్యుత్ కనెక్షన్లను ప్రస్తుత యజమాని పేరు మీదకు మార్చుకునేందుకు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఎటువంటి సందేహలు ఉన్నా 1912 సంప్రదించాలని డిఇ వెంకటేశ్వరరావు తెలిపారు.

'వైసిపి హయాంలో రాష్ట్రాభివృద్ధి అధోగతి'


ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాలు చేస్తుందని టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు విమర్శించారు. కోలనపల్లి, కోమటిగుంట, సూర్యారావుపేట గ్రామాల్లో సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. మినీ మేనిఫెస్టో అంశాలను మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తోట ఫణిబాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు వేగేశ్న రమేష్‌రాజు, బండారు వేణుగోపాలరావు, తెలుగు యువత మండలాధ్యక్షుడు మంతెన నాగాంజనేయులు, గులిపల్లి జోగయ్య, గ్రామాధ్యక్షులు జిఎన్‌వి.సత్యనారాయణ, మంతెన చినవెంకటరాజు, తుమ్మగుంట గౌతమి, బోధనపు రత్నకుమారి, కొట్టు ఇందిరా, తిరుమలశెట్టి లీలావతి, పోతల పద్మకుమారి, పుప్పాల బుజ్జి పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబు నాయుడు రాజమండ్రిలో ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు పెద్దపీట వేస్తూ ఆరు కీలకమైన పథకాలను ప్రవేశపెట్టారని ఎంపిపి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆచంట మండలంలోని పెదమల్లం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు, వైస్ ఎంపిపి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడి శెట్టిబలిజ రామాలయం నుంచి టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మహిళా శక్తి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు తనయుడు వెంకట్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకొచ్చాక టిడిపి అమలు చేస్తే పథకాల గురించి ప్రజలకు వివరించారు.

మొగల్తూరు : అన్నారు. మండలంలోని కెపి.పాలెం నార్త్ గ్రామంలో మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు సిరిగినీడి రాజలక్ష్మి మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు.


కాళ్ల : కోలనపల్లిలో టిడిపి నేతలు

ఎస్‌పి రవిప్రకాష్‌ను కలిసిన బాలకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఎస్‌పి రవిప్రకాష్‌ను ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించా రు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్‌సి ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సంబంధించి జాప్యం జరుగుతుం దని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌పిని కోరారు. బాలకృష్ణతో పాటు దళిత నేత మంగరాజు ఉన్నారు.

కళాశాలలో వాకింగ్ ట్రాక్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని వైఎన్ కళాశాలలో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మించడం మంచి తరుణమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా వాకింగ్ చేసి తమ రోజును ఆరోగ్యంగా ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో 11 కెవి మెయిన్ రోడ్డు ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెయిన్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, శేషమహాలు, నందిబొమ్మ సెంటర్, బస్టాండ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

'కేసు కుట్ర పూరితం'

ఉండి :గ్రామంలో అవినీతికి తావు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తనను కొందరు వ్యక్తులు కావాలనే కక్షపూరితంగా కేసులో ఇరికించారని వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అల్లర్లను నిలువరించేందుకు గ్రామ ప్రథమ పౌరుడుగానే తాను ఎస్‌సి పేటకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తూ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు. ఇవి నచ్చని ఒక వర్గం నాయకులు డిఎస్‌పి విచారణలో తనను ఇరికించి ఇబ్బంది పెడుతున్నారని, అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని ఆయన కోరారు.

దస్తావేజు పోయినది

నేను ది.18-08-2023వ తేది ఏలూరు సిటీ, ప్రయాణించు చుండగ, మాదేపల్లి రోడ్డు లో జిరాక్సు తీయుంచుకొను సందర్భం లో నాకు హక్కుగా గల ఫ్లాట్ నెం:66, చ.గ. 310 గల స్థలం యొక్క స్థిరాస్తికి సంబంధించిన హైదరాబాద్ పెద అంబరుపేట రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టరు కాబడిన దస్తావేజు నెం:1265/2001 నా వద్ద నుండి జారిపడి పోయినది.దొరికినవారు తెలియజేయగలరు.

ఇట్లు:- గొరిపర్తి కళ్యాణి
ఫోన్:9000213929.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు

ఒ.యస్.నెం. 47/2019 మరియు
ఐ.ఎ.నెం. 857/2019
ఒ.యస్.నెం.47/2019

బిట్వీన్:
పద్మనాభుని కిరణ్మయి ...వాది
మరియు
మల్లెంపల్లి లక్ష్మి ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాది మరియు పై నెంబరు గల పిటీషనులో రెస్పాండెంటు అయిన మల్లెంపల్లి లక్ష్మి, భర్త: గోపాలరావు, బాపిరాజుగూడెం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా వారికి పై నెంబరు గల దావాలో మరియు ఐ.ఎ.నెం.857/2019 పిటీషనులో పై కోర్టులో **ది.01-09-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొన వచ్చును.** లేని ఎడల సదరు దావా మరియు పిటీషనులు ఏకపక్షముగా తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
19-8-23. అశోక నగర్, ఏలూరు.

మహారాజశ్రీ భీమవరం ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 529/2022

Between:
దారపురెడ్డి లక్ష్మీనారాయణ -వాది
AND
దారపురెడ్డి వీరాస్వామి వగైరా -ప్రతివాదులు

2వ ప్రతివాది: దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, వయస్సు 52 సం॥లు, హిందు, పురుషుడు, వ్యవసాయం, డోర్ నెం. 2-56, మెయిన్‌రోడ్డు, చినకాపవరం గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా BJCJ Court.

వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట **ది. 28-08-2023 ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేని యెడల మీపై శ్రీ కోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపరు ప్రకటన ఇవ్వటమైనది)

కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ
ది.21-08-2023 సెల్: 9849356865